

ప్రజాపాలన దరఖాస్తులెక్కడ?
ప్రజాపాలన దరఖాస్తులను సరైన విధంగా నమోదు చేయకపోవడంతో కొందరి వివరాలు ఆన్‌లైన్‌లో చూపించడం లేదు.
- 8లో ▸



సంత.. తప్పని చింత
జిల్లాలో చాలా చోట్ల వారాంతపు సంతల నిర్వహణకు స్థలం, వసతులు లేక రోడ్లపైనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.2 /17.8
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స.హ. చట్టం వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స.హ చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ఎన్నో విజయాలు సాధించామన్నారు. 20వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆయా మండలాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు ప్రదీప్‌కుమార్, లింబయ్య, భాస్కర్, షబానా బేగం, జమున, రాజేశ్వర్, అన్వర్ ఘోరీ, పంతులు రవి, వడ్ల అశోక్, డెయిరీ లింగం తదితరులు పాల్గొన్నారు.

‘సాగర్’లోకి 13,662 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



నిజాంసాగర్(జుక్కల్): ఎగువ ప్రాంతాల నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం సాయంత్రం 13,662 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 13,562 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులకు గాను ప్రస్తుతం 1405 (17.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

నియామకం



కామారెడ్డి టౌన్: ఆల్ ఇండియా ఫోరమ్ ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడ రేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సకినాల అనిల్ కుమా ర్ నియమితులయ్యారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఇటీవల జరిగిన 8వ జాతీయ కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అందులో ఆయనకు చోటు దక్కింది. ఈ మేరకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు అనిల్‌ను అభినందించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందజేయాలి

కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ చేసిన తర్వాత రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు వెంటనే అందించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబీర్ మనోహర్‌రావు, జనపాల లక్ష్మీరాజంలు అన్నారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించగా వారు పాల్గొని, మాట్లాడారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాల చెల్లింపు, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు, పీఆర్సీ, డీఏలను వెంటనే అందించాలని తీర్మానించినట్టు వారు వివరించారు.

కౌలు రైతుకు కాలం కలిసి రాలె..

సొంత భూమి లేకపోయినా కౌలు తీసుకొని పంటలు వేసిన రైతులకు ఈసారి కాలం కలిసి రాలేదు. భారీ వర్షాలు ఊహించని దెబ్బతీశాయి. చేతికొచ్చిన పంటలు వేలాది ఎకరాల్లో దెబ్బతిన్నాయి. అటు కౌలు చెల్లించేందుకు డబ్బులు లేక, ఇటు పెట్టుబడి తిరిగి చేతికి వచ్చే పరిస్థితి లేక కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

అతివృష్టితో దెబ్బతిన్న పంటలు
- కుండపోత వర్షాలతో సోయా, పెసర, మినుము, కంది, పత్తి పంటలకు నష్టం
- పరిహారం కోసం కౌలు రైతుల వినతి



మద్నూర్‌లో వరదలతో పూర్తిగా దెబ్బతిన్న సోయాపంట

మద్నూర్(జుక్కల్): ప్రతి సంవత్సరం కౌలు రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఆరుగాలం కష్టపడి పంటలు పండించి నాలుగు పైసలు వెనుకేసుకుందామన్న కౌలు రైతుల ఆశలు ఆడియాశలవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది అతివృష్టి కారణంగా చేతికి వచ్చిన సోయాబీన్, పెసర, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరోవైపు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పులపాలవుతున్నారు.

ఎకరానికి రూ.24 వేల కౌలు..

జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు కౌలు చేస్తుంటారు. ఎకరానికి రూ.18వేల నుంచి రూ.24 వేలకు చెల్లించాల్సి ఉంటుంది. కౌలుకు తీసుకున్న భూమిలో పత్తి, పెసర, మినుము, సోయాబీన్, కంది పంటలు వేయగా కలుపు తీసేందుకు కూలీలకు, విత్తనాలు, ఎరువులు తదితర వాటికి పెద్దమొత్తంలో ఖర్చు చేసినప్పటికీ కనీసం పెట్టుబడి సైతం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ మండలంలో 35 వేల ఎకరాల్లో సోయా పంట వేయగా సుమారు 5 వేల ఎకరాల్లో అధిక వర్షాలతో దెబ్బతిన్నట్లు అధికారుల సర్వేలో వెల్లడైంది. డోంగ్లీ మండలంలో 200 ఎకరాల్లో వరి పొలాలు కోతకు గురై ఇసుక మేటలు పేరుకుపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం పంట రుణాలు, నష్టపరిహారం డబ్బులను భూ యాజమానులకే కేటాయిస్తోందని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



30 ఏళ్లుగా వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నాను. ఎకరానికి రూ.24 వేలతో కౌలు చేస్తున్న. ఈసారి ఆరు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సోయా పంట వేశాను. భారీ వర్షాలతో ఎకరానికి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అధిక వర్షాలు లేదంటే అసలే వర్షాలు లేకపోవడంతో పంటలు పండడం లేదు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. – పండరి, కౌలు రైతు, మద్నూర్

వర్షాలు నష్టం చేశాయి



నేను 10 ఎకరాలలో కౌలు చేస్తాను. ఎకరానికి రూ.23 వేలు చెల్లిస్తున్నా. మా కుటుంబం మొత్తం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంది. మాకు వేరే పనులు తెలియవు. ఈసారి అధిక వర్షాలతో సోయా, కంది, పెసర పంటలు పూర్తిగా నీట మునిగాయి. సరిగ్గా పంట చేతికందే సమయంలోనే వర్షాలు నష్టం చేకూర్చాయి.
– తుకారాం, కౌలు రైతు, మద్నూర్

డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు కసరత్తు!

- నేడు జిల్లా కేంద్రానికి రానున్న ఏఐసీసీ, పీసీసీ పరిశీలకులు
- ఎల్లుండి నుంచి నియోజకవర్గాల వారీగా సమావేశాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడితోపాటు కార్యవర్గాన్ని ఎన్నుకునే అంశంపై పార్టీ నాయకత్వం కసరత్తు మొదలుపెట్టింది. అందులో భాగంగా జిల్లా ముఖ్య నేతలతో ఏఐసీసీ పరిశీలకుడు రాజ్‌పాల్ సింగ్ కరోలా, పీసీసీ పరిశీలకులు సోమవారం కామారెడ్డి పట్టణానికి రానున్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతల సమావేశంలో పాల్గొంటారు. నాలుగు నియోజకవర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పీసీసీ, డీసీసీ ప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొంటారు. మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో మాట్లాడిన అనంతరం సాయంత్రం వరకు నాయకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. రాత్రి మహిళా సమూహాలు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలతో మాట్లాడుతారు. 14న జుక్కల్, 15న ఎల్లారెడ్డి, 16న బాన్సువాడ, 17న కామారెడ్డిలో నియోజకవర్గాల వారీగా నిర్వహించే కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటారు. 18న కామారెడ్డిలోనే ఉండి వివిధ వర్గాలతో సమావేశం కానున్నారు. ఏఐసీసీ పరిశీలకుని వెంట పీసీసీ ప్రతినిధులు విజయరమణారావ్, శోభ, అశోక్‌రెడ్డి సైతం సమావేశాల్లో పాల్గొంటారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావ్, లక్ష్మీకాంతారావ్, ఇతర నేతలు హాజరవుతారు. సమావేశాల సందర్భంగా డీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే వివిధ జిల్లాల్లో దరఖాస్తులు స్వీకరించారు. డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కైలాస్ శ్రీనివాస్ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్టు తెలుస్తోంది. జుక్కల్ నియోజకవర్గానికి చెందిన మల్లికార్జున్ కూడా డీసీసీ రేసులో ఉన్నారు. ఎవరెవరు దరఖాస్తు చేసుకుంటారు ? ఎవరికి పదవి దక్కుతుందన్న దానిపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- పలుచోట్ల త్వరలో ప్రారంభం కానున్న వరి కోతలు
- ధాన్యం ఆరబోతకు ఇబ్బందులు



మద్దికుంటలో బండపై ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

రామారెడ్డి: జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు స్థలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వరి ధాన్యం ఆరబెట్టేందుకు సరైన స్థలం, కల్లాలు లేక రైతులు ఇబ్బందులుపడుతున్నారు. చివరికి రోడ్లపై వడ్లను ఆరబోస్తుండడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. జిల్లాలోని రామారెడ్డి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రానికి ఏటా 30 వేల క్వింటాళ్ల ధాన్యం వస్తుంది. మరో పక్షం రోజుల్లో వరి కోతలు మొదలుకానున్నాయి. ఏటా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే స్థలంలో యజమానులు వెంచర్ వేశారు. దీంతో వడ్లు ఎక్కడ ఆరబోయాలనే సందిగ్ధంలో పడ్డారు. మరోవైపు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకూ నిర్వాహకులకు తిప్పలు తప్పేలా లేవు.

సర్దుకుపోతున్నాం



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు సరిపోవడం లేదు. ఉన్నచోట సర్దుకుపోతున్నాం. గతంలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో సమస్యలు తలెత్తలేదు. ప్రస్తుతం అన్ని స్థలాల్లో పంటలు వేయడంతో ఇబ్బందిగా తయారైంది.– గంగారెడ్డి, రైతు రామారెడ్డి

వర్షం వస్తే ఇబ్బందే..



ఈసారి వడ్లు ఆరబోసేందుకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడే పోయాల్సిన పరిస్థితి వస్తుంది. వడ్ల ఆరబోత, కొనుగోలు కేంద్రాల కోసం దూరం వెళ్లాల్సి వస్తుందేమో. మధ్యలో వర్షం వస్తే ఇబ్బంది అవుతుంది. – సలావత్ లక్ష్మి, స్కూల్ తండా

కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న భూపాల్

కామారెడ్డి టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో చాలా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని తక్షణమే క్రమబద్ధీకరణ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన యూనియన్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు చేపడుతున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పేస్కేల్ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. జీజీహెచ్‌లో తొలగించిన ఆరోగ్యశ్రీ ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నవంబర్ 9న సంగారెడ్డిలో జరిగే యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, అధ్యక్షురాలుగా జ్యోత్స్నదేవి, కార్యదర్శిగా అల్లాఉద్దీన్‌తోపాటు పలువురిని ఎన్నుకున్నారు. నాయకులు బాబు, సావిత్రి, స్వామి, గంగాధర్, అన్నపూర్ణ, కవిత, సుజాత, కళ్యాణి, అమీనుద్దీన్, వీరేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

దోమలు దండిగా.. ‘ఫాగింగ్’ వృథాగా..

- గ్రామాల్లో మూలనపడ్డ ఫాగింగ్ మిషన్లు
- పట్టించుకోని అధికారులు
- విజృంభిస్తున్న దోమలు.. రోగాలపాలవుతున్న ప్రజలు



దోమకొండ గ్రామ పంచాయతీలో వృథాగా ఉన్న ఫాగింగ్ మిషన్



దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలో రోడ్డుపై నిలిచిన నీరు

దోమకొండ: మండల కేంద్రాలు, గ్రామాల్లో దోమల నివారణకు వినియోగించే ఫాగింగ్ మిషన్లను ఎవరూ పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. దీంతో దోమలు విజృంభించడంతో ప్రజలు అనారోగ్యానికి గురై తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలువురికి డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు రావడంతో వైద్యుల చుట్టూ తిరుగుతున్నారు. ఫాగింగ్ మిషన్ వల్ల కనీసం దోమలను నివారించడానికి అవకాశం ఉంది. అయినా వాటి వినియోగంపై అధికారులెవరూ శ్రద్ధ చూపడం లేదు.

నిధుల కొరతే కారణం..

జిల్లాలో 22 మండలాలు ఉండగా, 532 గ్రామ పంచాయతీలు, 4,563 వార్డులు ఉన్నాయి. కాగా గ్రామాల్లో సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాలు సమకూర్చుకునేలా అయిదేళ్ల క్రితం ప్రభుత్వం ఒక్కో పంచాయతీకి రూ.42 వేలు కేటాయించగా ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో జనాభా, వార్డుల సంఖ్యను బట్టి రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ఫాగింగ్ చేయడానికి ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. కాగా నిధుల కొరతతో అనేక పంచాయతీల్లో ఈ ఫాగింగ్ యంత్రాలను వినియోగించక మూలన పడేశారు. ప్రస్తుతం ఇవి చాలా చోట్ల మొరాయిస్తున్నాయి. వాటికి మరమ్మతులు కూడా చేయించకపోవడంతో జీపీ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. పారిశుద్ధ్యానికి నిధులు కేటాయిస్తున్నా వాటిని ఇతర పనులకు వినియోగించడంతో దోమల నివారణ చర్యలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న స్థానిక సంస్థల్లో వెంటనే యంత్రాలు కొనుగోలు చేసి దోమల నివారణపై దృష్టి పెడితే వ్యాధులు నియంత్రించే అవకాశముందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దోమలతో ఇబ్బందులు..



మండల కేంద్రంలో దోమలు విజృంభించడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. గతంలో పంచాయతీ పాలకవర్గాలు ఉండగా, సర్పంచ్‌లు వార్డుసభ్యులకు సమస్యను విన్నవిస్తే, వారు స్పందించేవారు. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలనలో ఎవరూ సమస్యను పట్టించుకోవడం లేదు. కనీసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలి. – మల్లేశం, దోమకొండ

మరమ్మతులు చేయిస్తాం..



గ్రామాల్లో దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వృథాగా ఉన్న ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు చేయించి అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేసేలా చూస్తాం. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఖచ్చితంగా గ్రామాలు, వార్డుల్లో దోమల నివారణకు ఫాగింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటాం.
– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, దోమకొండ

ఉపాధి హామీలో ఎఫ్‌ఆర్‌ఎస్

- పక్కాగా పనుల నిర్వహణ
- అవకతవకలకు అడ్డుకట్ట
- కూలీల ముఖ చిత్రాలు నమోదు
- జాబ్‌కార్డులో ఉన్న వారికి ఈ-కేవైసీ
- ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



నర్వలో ఉపాధి కూలీల ముఖచిత్రాలను నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్

నిజాంసాగర్(జుక్కల్): ఉపాధి హామీ పనుల కల్పనతోపాటు కూలీల హాజరు నమోదులో అవకతవకలు జరుగకుండా పక్కాగా.. పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాబ్‌కార్డు ఉన్న కుటుంబసభ్యుల ఆధార్ కార్డుల అనుసంధానంతోపాటు ఈ-కేవైసీ, పనులు చేసే కూలీల ముఖచిత్రాలు (ఎఫ్‌ఆర్‌ఎస్) నమోదు ప్రక్రియను వేగవంతం చేసింది.

ఈ-కేవైసీ లింకు!

జిల్లా వ్యాప్తంగా 2,55,661 కుటుంబాలకు ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో జాబ్‌కార్డు ఉన్న కుటుంబాలతోపాటు ఉపాధి పనులు చేస్తున్న కూలీల ఆధార్ కార్డు నెంబర్ల ఈ-కేవైసీ చేపడుతున్నారు. ఇప్పటికే ఉపాధి పనులను గూగుల్ యాప్‌లో పొందుపర్చడంతోపాటు పనిప్రదేశంలో ఈజీఎస్ సిబ్బంది కూలీల హాజరును నమోదు చేస్తున్నారు. అయితే, కూలీల హాజరు నమోదులోనూ అక్కడక్కడ అవకతవకలు జరుగుతున్నాయి. కూలీ డబ్బులు అక్రమార్కుల చేతుల్లోకి వెళుతున్నాయి. దీంతో ఉపాధి హామీ పథకం మరింత పక్కాగా అమలు చేయడంతోపాటు పని చేసినవారి చేతికే కూలీ డబ్బులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రోజూ పని ప్రదేశంలోనే కూలీల ముఖచిత్రాల నమోదుకు ఆదేశించింది. విద్యాశాఖ, ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) విధానాన్ని ఉపాధి హామీలో అమలు చేస్తోంది.

వారం రోజుల్లో పూర్తి



జాబ్‌కార్డు ఉన్న కుటుంబసభ్యుల ఆధార్ నెంబర్ల ఈ-కేవైసీ చేపడుతున్నాం. ఉపాధి పనులకు వస్తున్న కూలీల ముఖచిత్రాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఫోన్లలో నమోదు చేస్తున్నారు. వారం రోజుల్లో వందశాతం ఈ-కేవైసీ, ఎఫ్‌ఆర్‌ఎస్ పూర్తయ్యేలా చూస్తున్నాం.
– సుదర్శన్, ఏపీవో, పెద్దకొడప్‌గల్

ఇంటికి హరిత కళ

- పెరటి, మిద్దె తోటలతో ఆహ్లాదకర వాతావరణం
- హరితమయంగా చిట్టిమల్ల అనంతరాములు ఇల్లు



మిద్దెపై మొక్కల మధ్య అనంతరాములు

కామారెడ్డి అర్బన్: పచ్చని చెట్లతో నిండిన ఈ ఇల్లు అందరినీ ఆకట్టుకుంటోంది. కామారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని జయశంకర్ కాలనీలోని చిట్టిమల్ల అనంతరాములు ఇల్లుకు ఓ ప్రత్యేకత ఉంది. ఇంటి స్థలం పోగా మిగిలినదంతా ప్రకృతికే అంకితమిచ్చారు. ఇంటిపైన కుండీల్లో, ఇంటికి ఇరువైపులా, సందు భాగాల్లో ఫలాలు అందించే మొక్కలు, కూరగాయలు, ఆకుకూరల తదితర మొక్కలు తారసపడతాయి. నిత్యం వంటల్లో వినియోగించే కూరగాయలు, ఆకు కూరలను సేంద్రియ ఎరువులు వేసి పండిస్తున్నారు. ఒకవైపు పోషకాలు మెండుగా ఉండే ఆహారం లభిస్తుండడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది.

25 రకాల మొక్కలున్నాయి

నాలుగైదు ఏళ్లుగా ఇంటి ఆవరణతోపాటు మిద్దెపై 25 రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, దుంపలు పండిస్తున్నాను. అందుకున్న రోజూ గంట నుంచి రెండు గంటలపాటు శ్రమిస్తాను. మానసికంగా ఎంతో తృప్తి కల్గుతుంది. మొక్కలను స్నేహితుడిలా భావిస్తున్నాను.
– చిట్టిమల్ల అనంతరాములు

క్లుప్తంగా

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు



ఎల్లారెడ్డి: ఆటోడ్రైవర్లు తమ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఎస్సై మహేశ్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటోడ్రైవర్లు వారి వెంట ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు ఉంచుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని అన్నారు.

బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా తుల శ్రీధర్

బాన్సువాడ: బాన్సువాడ ఎస్‌హెచ్‌వోగా తుల శ్రీధర్ బదిలీపై వచ్చారు. బాన్సువాడలో ఇదివరకు సీఐగా పని చేసిన మండల అశోక్‌ను ఐజీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. మల్టీజోన్‌లో భాగంగా పీసీఆర్ కామారెడ్డిలో పని చేసిన తుల శ్రీధర్‌ను బాన్సువాడకు బదిలీ చేశారు. బాన్సువాడకు బదిలీలైన శ్రీధర్ నేడు బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఎల్లారెడ్డిరూరల్: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై మహేశ్ సూచించారు. ఆదివారం ఎల్లారెడ్డిలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బైక్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

భర్తపై పోలీసులకు ఫిర్యాదు



భిక్కనూరు: తనతో పాటు పిల్లలపై దాడిచేసి పారిపోయిన భర్తపై చర్యలు తీసుకోవాలని పిట్ల ప్రియాంక అనే మహిళ భిక్కనూరు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన ప్రియాంక వివాహం దోమకొండ మండలం గోపాలపల్లి గ్రామానికి చెందిన పిట్ల భాస్కర్‌తో ఆరేళ్ల క్రితం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రియాంక ఇటీవల తన పుట్టినిల్లు అయిన కాచాపూర్‌కు రాగా భర్త భాస్కర్ గ్రామానికి వచ్చి ప్రియాంకతో పాటు పిల్లలపై దాడి చేసి పరారయ్యాడు. తమపై దాడి చేసి పరారైన భర్త భాస్కర్‌పై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'జుక్కల్‌లో జాగృతి కార్యక్రమాలు చేపడతాం'



మద్నూర్(జుక్కల్): ఎమ్మెల్సీ కవిత ఆదేశాలతో జుక్కల్ నియోజకవర్గంలో జాగృతి కార్యక్రమాలు చేపడతామని జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలో జాగృతి ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జాగృతి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ ఎత్తున కవిత సభ ఉంటుందని తెలిపారు. నాయకులు సురేశ్‌గౌడ్, బాలరాజు ఉన్నారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

నిజామాబాద్ అర్బన్: నగరంలోని కోర్టు చౌరస్తాలో ఆదివారం బైక్, ఆటో ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కోర్టు చౌరస్తాలో వేగంగా వస్తున్న బైకు ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు.

మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్ సీజ్

తాడ్వాయి: అక్రమంగా మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు. శనివారం తాడ్వాయి మండలంలోని జంగల్‌దేమి మైనింగ్ గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ, టిప్పర్‌తో మొరంను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు పేర్కొన్నారు. జేసీబీ, టిప్పర్‌ను సీజ్ చేసి డ్రైవర్లు లక్ష్మణ్, హరీశ్‌గౌడ్‌పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో ప్రజాపాలన దరఖాస్తులెక్కడ?

- అర్హులకు అందని సంక్షేమ పథకాలు
- ఎంపీడీవో కార్యాలయం చుట్టూ చక్కర్లు
- ఆన్‌లైన్‌లో మరోసారి అవకాశం కల్పించాలని ప్రజల వేడుకోలు



దరఖాస్తులు పరిశీలిస్తున్న అప్పటి కలెక్టర్ జితేష్(ఫైల్)



బిచ్కుందలో ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు(ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అధికారుల నిర్లక్ష్యంతో అర్హులైన లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మారాయి. ఆరు గ్యారంటీల పథకాలు అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకోవాలని సూచించిన విషయం తెలిసిందే. అప్పట్లో ప్రజలు ప్రజాపాలనలో రేషన్ కార్డులు, 200 యూనిట్ కరెంటు ఉచితం, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు కావాలని దరఖాస్తు పెట్టుకున్నారు. అధికారులు కొన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఆన్‌లైన్‌లో వారి వివరాలు చూపించడం లేదు. అర్హులు పథకాలకు దూరమయ్యారు. లబ్ధిదారులు.. అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది.

జీపీ కార్యదర్శుల నిర్లక్ష్యం..

ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఒక మున్సిపాలిటీలో కలిపి మొత్తం 16,421 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జీపీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించి పలు దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకుండా వదిలేశారు. మరికొన్నింటికి ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్‌పై టిక్ చేయకుండా ఆన్‌లైన్ చేయడంతో కొందరికి పథకాలు అందడం లేదు. అర్హులున్నప్పటికి పథకాలు అందడం లేదని ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్నా లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో కనపడటం లేదు. తమ చేతిలో ఏమి లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి ప్రజా పాలన పెండింగ్ దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకోవడానికి మరో అవకాశం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కరెంటు పథకం రావడం లేదు



ఆరు గ్యారంటీ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకుంటే రసీదు కూడా ఇచ్చారు. ఉచిత కరెంటు, గ్యాస్ సిలిండర్ పథకం వర్తించడం లేదు. ఆన్‌లైన్ కాలేదని అధికారులు అంటున్నారు. చాలా సార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ప్రతి నెలా కరెంటు బిల్లు కడుతున్నాను. సిలిండర్ వెయ్యికి కొనుగోలు చేస్తున్నాను.

–షేక్ హుస్సేన్, బిచ్కుంద

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?



కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే దారిలో ధ్వంసమైన రోడ్డు

కామారెడ్డి టౌన్: ఇటీవల భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలో రోడ్లు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే దారి, హౌసింగ్ బోర్డు కాలనీలోని వైకుంఠధామానికి వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పుర ప్రజలు అంత్యక్రియల కోసం వైకుంఠధామానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే దారికూడా ప్రమాదకరంగా మారింది. దాదాపు రెండు నెలలు కావస్తున్నా మరమ్మతులు జరిపించడం లేరని అధికారులపై పుర ప్రజలు మండిపడుతున్నారు.



హౌసింగ్‌బోర్డు వైకుంఠధామానికి వెళ్లే మార్గంలో ధ్వంసమైన దారి

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు సరంపల్లి గ్రామంలో వాటర్ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే మోటార్ పైప్ లైన్ లీకేజీ కావడంతో ఆదివారం పైప్‌లైన్ పనులు చేపట్టారు. పాత పైప్‌లైన్‌కు బదులుగా కొత్త పైపులు తెచ్చి బాగు చేయించినట్లు మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ తెలిపారు.

అనవసరపు కాల్స్ వేధిస్తున్నాయా..?

మీకోసం..



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మీరు అత్యవసర పనుల్లో, ఇతరులతో సమావేశాల్లో ఉన్నప్పుడు ప్రమోషనల్, మార్కెటింగ్ కాల్స్ వస్తుంటాయి. ఈ అనవసరపు ఫోన్‌కాల్స్ రోజు ఇబ్బంది పెడుతున్నాయా... అయితే ఫోన్‌లో పలు మార్పులతో కట్టడి చేయొచ్చు. యాక్టివేట్ డీఎన్డీ ప్రమోషనల్, మార్కెటింగ్ ఫోన్ కాల్స్ రాకుండా ఉండాలంటే మొదట ఫోన్‌లో డీఎన్డీ ఆప్షన్‌ను ఎనేబుల్ చేయాలి.

- STARTO అని టైప్ చేసి.. 1909కి ఎస్ఎంఎస్ చేస్తే ప్రమోషనల్ కాల్స్ ఆగిపోతాయి. వెబ్‌సైట్ https:/// www. dndcheck. co. in లోకి వెళ్లి 'నేషనల్ డునాట్ కాల్ రిజిస్ట్రీ'లో ప్రమోషనల్ కాల్స్‌కు అడ్డుకట్ట వేయొచ్చు. టెలికాం ప్రొవైడర్లందరికీ.. అధికారిక యాప్ ఉంటుంది.(ఉదాహరణకు మై జియో, ఎయిర్‌టెల్ థ్యాంక్స్, వీఐ యాప్). అందులో డీఎన్డీ సెట్టింగ్‌లోకి వెళ్లి ప్రిఫరెన్స్ ఎంపిక చేసుకొని ప్రమోషనల్ కాల్స్ బ్లాక్ చేయొచ్చు.
- బ్యాంక్ వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ అయ్యి.. కమ్యూనికేషన్ ప్రిఫరెన్సెస్ లేదా ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి మార్కెటింగ్, ప్రమోషనల్ ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్, కాల్స్ ఆప్షన్ డిజేబుల్ చేయడం ద్వారా అనవసరపు ఫోన్‌కాల్స్‌ను తగ్గించుకోవచ్చు.

మాన్యువల్ నంబర్ బ్లాకింగ్..

డీఎన్డీ సెట్టింగ్‌ను యాక్టివేట్ చేసినా అనవసరమైన ఫోన్లు వస్తే ఫోన్‌లోని కాల్ బ్లాకింగ్ ఫీచర్‌ను ఉపయోగించి అడ్డుకట్ట వేయొచ్చు. ట్రూ కాలర్, కాల్ బ్లాకర్ లాంటి యాప్‌లు కూడా ఉన్నాయి. అవి స్పామ్, బ్యాంక్, మార్కెటింగ్ ఫోన్‌కాల్స్‌ను గుర్తిస్తాయి. ఒకసారి కాల్ వచ్చినప్పుడు 'మార్క్ కాల్స్ యాజ్ స్పామ్' ఆప్షన్ ఎంచుకుంటే ..ఆ తర్వాతి నుంచి ఆయా నంబర్ల నుంచి కాల్స్ రావు.

నేరుగా బ్యాంకుకే..

ఒకే బ్యాంక్‌కు చెందిన మార్కెటింగ్ సిబ్బంది నుంచి తరచూ కాల్స్ వస్తుంటే.. ఆ బ్యాంక్ కస్టమర్ కేర్ సర్వీసుకు కాల్ చేసి.. లేదంటే నేరుగా బ్రాంచ్‌కి వెళ్లి 'అప్డేట్ యువర్ ప్రిఫరెన్సెస్'ను మార్చాలని కోరాలి. గతంలో మీరు 'మార్కెటింగ్ కమ్యూనికేషన్'కు అంగీకారం తెలిపినట్లయితే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు కచ్చితంగా చెప్పాలి.

డీఎన్డీ ఆప్షన్ యాక్టివేట్ చేసినా..

కాల్స్ వస్తుంటే.. నేరుగా 1909కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేయొచ్చు. https:/// www. nccptrai. gov. in ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదు చేయొచ్చు.

వసతి గృహంలో ఉండాలంటే పని చేయాల్సిందేనా..?



బీర్కూర్ బీసీ వసతి గృహంలో పని చేస్తున్న విద్యార్థులు

బాన్సువాడ: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆదివారం వచ్చిందంటే సరదాగా గడపాలనే ఆశ ఉంటుంది. కానీ విద్యార్థుల ఆశలపై వసతి గృహ వార్డెన్లు నీళ్లు చల్లుతున్నారు. అలాంటి ఘటన బీర్కూర్‌లో చోటు చేసుకుంది. బీర్కూర్ బీసీ వసతి గృహంలో నలుగురు విద్యార్థులు చేతిలో పారలు పట్టుకుని గడ్డిని తొలగిస్తున్న దృశ్యం సాక్షి కంట పడింది. విద్యార్థులు పని చేస్తున్న ఫొటోలు దించే క్రమంలో వసతి గృహ సిబ్బంది వెళ్లి విద్యార్థుల చేతుల్లో ఉన్న పారలను తీసుకుని విద్యార్థులను గదుల్లోకి పంపించారు. వసతి గృహాలను పర్యవేక్షించాల్సిన అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో విద్యార్థులు వసతి గృహాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి రోడ్డు



గంగమ్మ వాగు బ్రిడ్జి పక్కన ఏర్పడిన గుంత

రామారెడ్డి: రామారెడ్డి నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలోని గంగమ్మ వాగు బ్రిడ్జి వద్ద ఏర్పడిన పెద్ద గుంతతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, వాహనదారులు భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, బైక్‌లు ప్రయాణం సాగిస్తున్నా ఆర్అండ్‌బీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చీకట్లో కొత్తగా వచ్చే వారు ప్రమాదానికి గురికావడం తప్పదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టి రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

వీరవనితల ధైర్యసాహసాలు వివరించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువతులు

- రాష్ట్రీయ సేవికా సమితి విజయదశమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: దేశ పునర్నిర్మాణంలో మహిళాశక్తి అనిర్వచనీయమైందని, ఎందరో వీర వనితలు దేశం కోసం త్యాగం చేశారని రాష్ట్రీయ సేవికా సమితి తెలంగాణ ప్రాంత కార్యవహిక శ్రీపాద రాధ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యా మందిర్‌లో రాష్ట్రీయ సేవికా సమితి విజయదశమి ఉత్సవం, 282 మంది సేవికలు ఘోష్‌తోపాటు పథసంచలనం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తగా హాజరై శ్రీపాద రాధ మాట్లాడగా అతిథి విశ్రాంత వైద్యురాలు ఉమాజనార్దన్ పాల్గొన్నారు. ప్రతి కుటుంబంలో తమ పిల్లలకు దేశ వీరవనితలు, సంఘ సంస్కర్తల పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలను వివరించాలని శ్రీపాద రాధ అన్నారు. హిందూ సామ్రాజ్యం స్థాపించడానికి శివాజీ తల్లి జిజియాబాయి చేసిన కృషిని చెప్పాలన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, రాణి అహల్యాబాయి హోల్కర్‌లాంటి వారు దేశం, సంస్కృతి సంప్రదాయాల కోసం చేసిన కృషి, సేవలను వివరించారు. కార్యక్రమంలో విభాగ్ కార్యవహిక గుజరాతి సరోజ, జిల్లా కార్యవహిక వీరమల్లి సరస్వతి, ప్రతినిధులు యజ్ఞశ్రీ, రాణి, బొంతపల్లి కల్పన, అనిత తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైల్వే పోలీసుల అదుపులో అనుమానాస్పద వ్యక్తులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఆర్‌పీఎస్ ఎస్సై తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైల్వే పోలీసులు తనిఖీ చేస్తుండగా ప్లాట్‌ఫారమ్–1 వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గంగాప్రసాద్ విశ్వంభర గైక్వాడ్, అమోల్ విశ్వంభర గైక్వాడ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా వారు పాత నేరస్తులుగా గుర్తించారు. వీరు మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. కూలీ పనులు చేసేవీరు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. అంతేకాకుండా గతంలో పలు నేరాలు చేసినట్లు వారు ఒప్పుకున్నారు. వీరి నుంచి విలువైన ఫోన్లు, రూ.18,700 నగదును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చనున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

నిజామాబాద్ అర్బన్: డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని శివాజీచౌక్ నుంచి దుబ్బవైపు వస్తున్న ప్రశాంత్, సందీప్ అనే యువకులు శనివారం రాత్రి గుర్బాబాది రోడ్డులో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా ప్రశాంత్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సందీప్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటమునిగి మత్స్యకారుడి మృతి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని రుద్రారం శివారులో ఉన్న నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి మత్స్యకారుడు మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మల్కాపూర్ గ్రామానికి చెందిన కొండ సంగయ్య(52) అనే మత్స్యకారుడు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

దుబాయిలో అయిలాపూర్ వాసి ఆత్మహత్య



సంగమేశ్వర్(ఫైల్)

లింగంపేట: మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన మన్నె సంగమేశ్వర్(27) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం తాను ఉండే ప్రాంతంలోని బాత్‌రూమ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. సంగమేశ్వర్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబీకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం మిర్ధాపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకోగా వారి నుంచి రూ. 48,800 నగదు, రెండు బైక్‌లు, ఒక కారు, ఆరు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.





సమ్మేళనంలో పాల్గొన్న బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, విశ్వశాంతి హైస్కూల్ 2007-08 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ముప్కాల్ ఉన్నత పాఠశాల పదోతరగతి 2003-04 బ్యాచ్ విద్యార్థులు

మోపాల్/ ఖలీల్‌వాడి/ మోర్తాడ్/ బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్/ సదాశివనగర్: నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చాలా ఏళ్ల తర్వాత విద్యార్థులంతా ఒకే వేదికపై కలవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, రాజు, నరేందర్, శ్రీహరి, లత, ఉమా మహేశ్వరి, దొంతుల రవి, కవిత, కల్పన, సుకన్య తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పద్మనగర్‌లో ఉన్న శ్రీ విశ్వశాంతి హైస్కూల్‌లో 2007–2008లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిదాస్, అరుణ, అనిల్, రాజేశ్, రాజేందర్, సుజాత, థామస్, ప్రసన్న, పాండు, గణేశ్, మురళి పాల్గొన్నారు. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో 2005–06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు జయలక్ష్మి, లావణ్య, స్వాతి, శిల్ప, శ్రావణి, లక్ష్మి, ప్రియాంక, సునీత, భాను తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని పద్మాజివాడి ఉన్నత పాఠశాలలో 2008–09 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు వీవీ రమణ, అబ్బయ్య, వాణి, లింగం, మీనా, సబిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పద్మాజివాడి ఉన్నత పాఠశాల పదోతరగతి 2008-09 బ్యాచ్ విద్యార్థులు



తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల పదో తరగతి 1999-2000 బ్యాచ్ విద్యార్థులు



ఆర్మూర్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి 2005-06 బ్యాచ్ విద్యార్థులు

జోరందుకున్న పంట కోతలు

- కల్లాల్లో శ్రమిస్తున్న రైతులు



డొంకేశ్వర్‌లో సోయా పంటను కోస్తున్న హార్వెస్టర్



తొండాకూర్‌లో మక్క దిగుబడులను కుప్పగా పోస్తున్న దృశ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాల తగ్గుముఖం పట్టి నేల గట్టిపడడంతో జిల్లా వ్యాప్తంగా పంట కోతలు ఊపందుకున్నాయి. సోయా, మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. దీంతో హార్వెస్టర్లకు గిరాకీ పెరిగింది. మొక్కజొన్న కోతకు గంటకు రూ.4వేలు, సోయాకు రూ.2,600 వరకు రైతుల వద్ద కిరాయి తీసుకుంటున్నారు. పంట దిగుబడులను నేరుగా ట్రాక్టర్లలో తీసుకొచ్చి కల్లాలు, రోడ్లపై ఎండబోస్తున్నారు. పంటను త్వరగా అమ్ముకునేందుకు రైతులు కల్లాల వద్దే తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఇంకా మక్క, సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో కొన్ని చోట్ల వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం త్వరగా కేంద్రాలను తెరవాలని రైతులు కోరుతున్నారు.